క్లుప్తంగా

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

తొగుట(దుబ్బాక): సీఎం కేసీఆర్ నాయకత్వంలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకుపోవాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి సూచించారు. మండలంలోని వెంకట్రావుపేటలో ఆదివారం బూత్ కమిటీలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయన్నారు. వచ్చే ఎన్నికల్లో దుబ్బాకలో గులాబీ జెండా ఎగురవేయాలని కార్యకర్తలకు సూచించారు. కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా సీఎం సహాయనిధి నుంచి మంజూరైన బెజ్జ రమైన నవీన్, ఎర్రోల్ల శ్రీనివాస్‌లకు రూ.12వేల చెక్కులు అందజేశారు. బూత్ కమిటీ అధ్యక్షులుగా డబ్బికాడి పెంటోజీ, పిట్ల వెంకటయ్యలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నర్సింలు, ఏఎంసీ, ఆత్మ కమిటీ డైరెక్టర్లు పరశురాములు, రాములు, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత



బాధిత కుటుంబానికి నగదు అందిస్తున్న యూత్ సభ్యులు

చేర్యాల(సిద్దిపేట): పట్టణ పరిధిలోని 2వ వార్డు యూత్ సభ్యుడు కమలాపురం రాజు కొద్ది నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడి కుమారుడు అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న యూత్ సభ్యులు ఆదివారం అధ్యక్షుడు చందా శ్రీకాంత్ ఆధ్వర్యంలో తమ వంతు సహాయంగా రూ.10వేలు అందించారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు కమలాపురం రమేశ్, దోమ శ్రీకాంత్, చందా అనిల్, బుట్టి సాయి, కాటం రాజశేఖర్, శ్రీరాం బాబి, మంగ వాసు, కాటం మహేశ్, కమలాపురం కిరణ్ పాల్గొన్నారు.

పేద కుటుంబానికి సాయం

వర్గల్(గజ్వేల్): మండలంలోని వేలూరుకు చెందిన షేక్ తాఫిక్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. అతనికి భార్య పర్వీన్‌బేగం, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. దీంతో అతని కుటుంబ పరిస్థితి దయనీయంగా మారింది. ఈ విషయం తెలుసుకున్న చెలిమి ఫౌండేషన్ ప్రతినిధులు తులసీదాస్, యాదగిరి, కిరణ్ కుమార్, ఆనంద్, శ్రీనివాస్ ఆదివారం కుటుంబీకులను పరామర్శించి రూ.6500 నగదు, వివిధ నిత్యావసర సరుకులు అందజేశారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



బోనాలతో వెళ్తున్న మహిళలు

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన ఎస్సీ కాలనీవాసులు ఆదివారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, పంటలు బాగా పండాలని మహిళలు బోనాలు చేసి మొక్కులు చెల్లించి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. డప్పుచప్పుళ్లు, శివసత్తుల శిగాలతో బోనాల ఊరేగింపు కనుల పండువగా సాగింది.

ప్రహరీ నిర్మాణ పనులు ప్రారంభం

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో ఎమ్మెల్యే నిధుల నుంచి రూ.5లక్షల ఖర్చుతో చేపడుతున్న కమ్యూనిటీ హాల్ ప్రహరీ నిర్మాణ పనులను ఆదివారం సర్పంచ్ తివారి దినేశ్ ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు బండారి సిద్దయ్య, శవల్ల కిష్టయ్య, శెట్టే ఓజయ్య, శవల్ల రాజయ్య, బండారి కనకయ్య, బండారి కిష్టయ్య, కొమురయ్య, సిద్దిరాములు పాల్గొన్నారు.

కమిటీ ఎన్నిక



హరిహర రెసిడెన్సీ కాలనీ కార్యవర్గ కమిటీ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని హరిహర రెసిడెన్సీ కాలనీ నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాలనీ గౌరవ అధ్యక్షులుగా ఆకుల సత్యనారాయణగౌడ్, సల్లారం మల్లారెడ్డి, అధ్యక్షుడిగా నాచగోని సత్యంగౌడ్‌ను, ప్రధాన కార్యదర్శిగా గణపతి సంతోష్‌కుమార్, ఆర్థిక కార్యదర్శిగా ఐలయ్య, ఉపాధ్యక్షులుగా ఈట కిరణ్, దుర్గయ్య, మల్లేశం, సంయుక్త కార్యదర్శిగా లక్కిరెడ్డి మహేందర్‌రెడ్డి, నజీరుద్దీన్, శ్రీనివాస్, ఈ.శ్రీధర్, భోగేశ్వర్‌లను, గౌరవ సలహాదారులుగా రాధాకృష్ణ, శ్రీధర్ రెడ్డి, రాములు, లింగమూర్తి, తిరుపతిరావులను, పీఆర్‌ఓగా సంగీతం నరసింహారావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. కాలనీ సమస్యలను పరిష్కరించడంలో అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు.

బ్రహ్మోత్సవాలకు ఆలయం ముస్తాబు

- రేపటి నుంచి వారంరోజుల పాటు నిర్వహణ
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ కమిటీ సభ్యులు



ముస్తాబైన సీతారామచంద్రస్వామి ఆలయం

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లిలో సుమారు 200 సంవత్సరాల క్రితం వెలిసిన సీతారామచంద్రస్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు అత్యంత సుందరంగా ముస్తాబైంది. ఈ నెల 28న చైత్ర శుద్ధ సప్తమి మంగళవారంతో ప్రారంభమై ఏప్రిల్ 3వ తేదీ సోమవారం చైత్ర శుద్ధ త్రయోదశి వరకు జరగనున్న బ్రహ్మోత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

కార్యక్రమ వివరాలు..

28న ఆరాధన, పుణ్యాహవచనం, 29న బాలయోగం, యాగశాల ప్రవేశం, అగ్నిప్రతిష్ఠ, దేవత ఆహ్వానం, 30న హవనం, బలిహరణం, ఎదుర్కోళ్లు, సాయంత్రం 5గంటలకు సీతారామచంద్రస్వామి కల్యాణోత్సవం, అశ్వవాహనంపై ఊరేగింపు, 31న కుంకుమార్చన, ఉత్సవ మూర్తులను హంస వాహనంపై ఊరేగింపు. ఏప్రిల్ 1వ తేదీన గజవాహనంపై ఊరేగింపు, 2న హనుమత్ వాహనంపై ఊరేగింపు, 3న మహా పూర్ణాహుతి, అభిషేకం, శేశ వాహనంపై ఊరేగింపు, ఏకాంత సేవ, తీర్థ ప్రసాద వితరణ, బ్రహ్మోత్సవాల సమాప్తిలు జరుగుతాయని ఉత్సవ కమిటీ నిర్వహణ బృందం, ఆలయ అర్చకులు తిరుమల లక్ష్మినర్సింహాచార్యులు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని దేవుని ఆశీస్సులు పొందాలని ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు.

యువత క్రీడల్లో రాణించాలి



ట్రోఫీ అందిస్తున్న కౌన్సిలర్ సులోచన

దుబ్బాక: యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని కౌన్సిలర్లు ఆస సులోచన స్వామి అన్నారు. దుబ్బాక పట్టణంలో నియోజకవర్గ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ గోసాన్‌పల్లి, దుబ్బాక జట్ల మధ్య హోరాహోరీగా జరిగింది. మొదటగా బ్యాటింగ్ చేసిన గోసాన్‌పల్లి టీమ్ 59 పరుగులకు ఆలౌట్ కాగా దుబ్బాక జట్టు 6 వికెట్లు కోల్పోయి 12 ఓవర్లలో లక్ష్యాన్ని చేధించారు. ఈ మ్యాచ్‌లో దుబ్బాక జట్టుకు చెందిన దీక్షిత్ 5 వికెట్లు తీసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు. ఇందులో హైట్రిక్ వికెట్లు తీయడం విశేషం. మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా కానుగల్ గ్రామానికి చెందిన కరణ్ ఎంపికయ్యాడు. విజేతకు ట్రోఫీతో పాటు రూ.15వేల నగదు, రన్నర్ గోసాన్‌పల్లి జట్టుకు రూ.7,500ల నగదును 13వ వార్డు కౌన్సిలర్ ఆస సులోచన స్వామి అందించారు. క్రికెట్ టోర్నమెంట్‌కు సహకరించిన కౌన్సిలర్లు ఆస యాదగిరి, నిమ్మ రజితకు ఆర్గనైజర్లు శ్రీశైలం, రాకేశ్, నవీన్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్టీసీ కార్గోలో భద్రాద్రి తలంబ్రాలు



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కార్గో కో–ఆర్డినేటర్ జయేందర్‌రెడ్డి

దుబ్బాక: శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలంలో నిర్వహించే సీతారామస్వామి కల్యాణ మహోత్సవంలో స్వామివారికి సమర్పించే ముత్యాల తలంబ్రాలను ఆర్టీసీ కార్గో సర్వీస్ ద్వారా అందజేస్తామని గజ్వేల్–ప్రజ్ఞాపూర్ డిపో కార్గో కో–ఆర్డినేటర్ జయేందర్‌రెడ్డి అన్నారు. రాయపోల్ మండల కేంద్రంలో భద్రాద్రి తలంబ్రాల వాల్‌పోస్టర్, కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. సీతారాముల కల్యాణ మహోత్సవంలో సమర్పించే ముత్యాల తలంబ్రాలను రూ.116కు ఆర్టీసీ కార్గో సేవల ద్వారా ప్రజలకు అందిస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకటశర్మ, నాయకులు రాజిరెడ్డి, మల్లారెడ్డి, సంజీవరెడ్డి, ముత్యంరెడ్డి, లక్ష్మణ్ తదితరులున్నారు.

ఆత్మరక్షణకు కరాటే దోహదం

సిద్దిపేట మున్సిపల్ ఛైర్‌పర్సన్ మంజుల

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఆత్మరక్షణకు కరాటే దోహదపడుతుందని సిద్దిపేట మున్సిపల్ ఛైర్‌పర్సన్ మంజుల అన్నారు. సిద్దిపేటలో జిల్లా స్థాయిలో నిర్వహించిన కరాటే పోటీల్లో విజేతలకు ఆదివారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇందిరానగర్‌లో ట్రస్మా స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గ మల్లారెడ్డితో కలిసి మంజుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కరాటే విద్యార్థులకు ఆత్మరక్షణగా ఉంటుందన్నారు. వయస్సుతో సంబంధం లేకుండా అందరూ కరాటే నేర్చుకోవాలన్నారు. అనంతరం కరాటే విన్యాసాలు చూపరులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ట్రస్మా స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లారెడ్డి, కరాటే మాస్టర్ భాగ్యరాజ్ పాల్గొన్నారు.

శోభాయాత్రను విజయవంతం చేయండి



శోభాయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న హిందూ వాహిని నాయకులు

హుస్నాబాద్: పట్టణంలో ఈ నెల 30న శ్రీరామ నవమి పురస్కరించుకొని నిర్వహించే శోభాయాత్రను విజయవంతం చేయాలని హుస్నాబాద్ హిందూ వాహిని అధ్యక్షుడు ఎర్రబెల్లి ప్రశాంత్ పిలుపునిచ్చాడు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో శోభాయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడుతూ.. హిందూవుల ఐక్యత, భావాలను పెంపొందించేందుకు మన పండగలు దోహదం చేస్తాయన్నారు. హిందూవులందరూ ఏకమై సాంప్రదాయాలను విచ్ఛిన్నం చేసే జాతులను తరమికొట్టాలన్నారు. శోభాయాత్రలో హిందూవులు స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చాడు. కార్యక్రమంలో హిందూ వాహిని జిల్లా సహ సంయోజక్ పూదరి వెంకటేశ్‌గౌడ్, నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, అనంత స్వామి, మణిదీప్, వంశీ, భాస్కర్, రాజశేఖర్ ఉన్నారు.

సన్మానం

హుస్నాబాద్: హుస్నాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా చిత్తారి రవీందర్ ఎన్నిక కావడంపై హర్షం వ్యక్తం చేస్తూ ఆదివారం స్వార్థి అసోసియేషన్ అధ్యక్షుడు శంకర్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా, ఏజీపీగా, లోక్ అదాలత్ మెంబర్‌గా న్యాయసేవలు అందించిన రవీందర్ రెండోసారి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నిక కావడం మంచి పరిణామమన్నారు. పేద ప్రజలకు న్యాయం అందే విధంగా సేవలను అందించి ఆదర్శంగా నిలవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ రజిత, వైస్ ఛైర్‌పర్సన్ అనిత, మాజీ ఎంపీపీ వెంకట్, కౌన్సిలర్ భాగ్యరెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు శంకర్‌రెడ్డి ఉన్నారు.

స్ప్రింక్లర్లు పంపిణీ



రైతులకు స్ప్రింక్లర్లు అందజేస్తున్న దృశ్యం

నంగునూరు(సిద్దిపేట): మంత్రి హరీశ్‌రావు చొరవతో రైతులకు స్ప్రింక్లర్లు మంజూరయ్యాయని వైస్ ఎంపీపీ కర్ణకంటి రేణుక అన్నారు. ఆదివారం గట్లమల్యాలలో 100 మంది రైతులకు సబ్సిడీపై స్ప్రింక్లర్ సెట్లను అందజేశారు. అనంతరం రేణుక మాట్లాడుతూ.. గ్రామంలోని చాలా మంది రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేస్తున్నారని, స్ప్రింక్లర్లు మంజూరు కావడంతో ఎంతో మేలు జరిగిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రమేశ్, వేణుగోపాలాచారి తదితరులు పాల్గొన్నారు.

భూగ్రహాన్ని కాపాడుకుందాం

సిద్దిపేటఎడ్యుకేషన్: జీవ వైవిధ్యం కలిగిన భూగ్రహాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ ప్రసాద్ అన్నారు. కళాశాల నేచర్‌క్లబ్, జీవశాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో శనివారం రాత్రి గంట పాటు విద్యార్థులు, అధ్యాపకులు వారి వారి నివాసాల్లో విద్యుత్ కాంతులను నిలిపివేసి ఎర్త్ అవర్‌డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించి ప్రజల్లో అవగాహన కల్పిస్తే పర్యావరణాన్ని పరిరక్షించి భూగ్రహాన్ని కాపాడిన వారం అవుతామన్నారు. జీవశాస్త్ర విభాగాధిపతి, నేచర్‌క్లబ్ కోఆర్డినేటర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అయోధ్యరెడ్డి మాట్లాడుతూ.. 2007 నుంచి వరల్డ్ వైల్డ్ లైఫ్ ఫండ్ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దీనికి ప్రపంచంలోని 190 దేశాలు మద్దతు పలికాయన్నారు. జీవ వైవిధ్యరక్షణకు విద్యార్థులు గ్రామీణ ప్రజలను చైతన్యం చేయాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ డాక్టర్ మధుసూదన్, డాక్టర్ పల్లవి, విశ్వనాథం, వైకుంఠం, వినోద్, చక్రవర్తి పాల్గొన్నారు.

ముసుగు తొలగేనా!



మేడిపల్లిలో అంబేడ్కర్ విగ్రహం

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని మేడిపల్లి గ్రామంలో పదేళ్ల క్రితం డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేశారు. అనాలోచిత విధానాలతో రోడ్డుపై విగ్రహం ఏర్పాటు చేయడంతో పాటు రాజకీయ నాయకుల మధ్య విభేదాలతో విగ్రహం ఆవిష్కరణకు నోచుకోవడం లేదు. పదేళ్లుగా విగ్రహం ముసుగుకే పరిమితమైంది. ముసుగు చినిగిపోతున్నా పట్టించుకునేవారు లేరు. విగ్రహావిష్కరణ జరుగుతుందా లేదా అనుమానాలు స్థానికుల్లో వ్యక్తమవుతున్నాయి.

ఎల్‌ఓసీ అందజేత

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లికి చెందిన సోదబోయిన సంధ్య వైద్యఖర్చుల నిమిత్తం మంజూరు చేసిన రూ.2లక్షల ఎల్‌ఓసీని ఆదివారం ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అనంతుల మల్లేశంతో కలిసి అందజేశాడు. కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణవేణి, ఎంపీటీసీ గూడూరు బాల్‌రాజు, నాయకులు జింకల పర్వతాలు, రాజశేఖర్, మాధవి, బాల్‌రెడ్డి, చంద్రం, నవీన్, వెంకటేశం, కనకయ్య, కుమార్, లక్ష్మణ్, వెంకట్‌రెడ్డి, రాజుబాబు ఉన్నారు.

చౌడుతండాను పంచాయతీగా ఏర్పాటు చేయాలి

అక్కన్నపేట(హుస్నాబాద్): మండల పరిధిలోని చౌడుతండా, బోదర్‌వాగు తండా, మంజ్యానాయక్ తండాలను కలుపుకొని చౌడుతండాను నూతన జీపీగా ఏర్పాటు చేయాలని కోరుతూ ఆదివారం ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్‌కు గిరిజనులు మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. కొండలు, గుట్టల మధ్య ఉన్నటువంటి ఈ తండాల్లో నిబంధనలు ప్రకారం జీపీగా వెంటనే ఏర్పాటు చేయొచ్చన్నారు. ఈ మూడు తండాల్లో దాదాపు 750 జనాభాకుపైగా ఉంటుందన్నారు. ఇప్పటికైనా త్వరితగతిన నూతన జీపీని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ విషయంపై ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మాలోతు లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు భూక్య మంగ, గుగులోతు రాజు, గుగులోతు అర్జున్, తండావాసులు తదితరులు ఉన్నారు.

హైమాస్ట్ లైట్లు బిగింపు



హైమాస్ట్ లైట్లను చూపుతున్న సర్పంచ్ రమణారెడ్డి, తదితరులు

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని అయినాపూర్ గ్రామంలో ఎమ్మెల్యే నిధుల ద్వారా కొనుగోలు చేసిన 28 హైమాస్ట్ లైట్లను ఆదివారం బిగించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రమణారెడ్డి, వైస్ ఎంపీపీ కాయిత రాజేందర్‌రెడ్డిలు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

పంటల పరిశీలన

కొండపాక(గజ్వేల్): అకాల వర్షంతో నష్టపోయిన వరి పంటలను, మామిడి తోటలను ఆదివారం వ్యవసాయ విస్తరణాధికారులు పరిశీలించారు. మండలంలోని జప్తినాచారం, సిర్సనగండ్ల గ్రామాల్లో వారు పర్యటించారు. వరికి సోకిన తెగుళ్లతో పంటను కాపాడుకోవడానికి వేలు ఖర్చులు చేసి మందులను పిచికారీ చేశామని, తీరా పంటలు పొట్టదశకు చేరుకోగానే వడగళ్లు పడి పంట దెబ్బతిన్నదని రైతులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈదురుగాలులకు మామిడి కాయలు రాలిపోయాయంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందేలా చూడాలని వ్యవసాయ విస్తరణాధికారులను వేడుకున్నారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ విస్తరణాధికారి ప్రియదర్శిణి మాట్లాడుతూ.. అకాల వర్షంతో దెబ్బతిన్న పంట నష్టం వివరాలను క్షేత్రస్థాయిలో తిరుగుతూ సేకరిస్తున్నామన్నారు. నష్టం వివరాలను ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. కార్యక్రమంలో అధికారులు మౌనిక, విష్ణు, రైతులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు మంత్రి పరామర్శ



గంగాపూర్ సర్పంచ్‌ను పరామర్శిస్తున్న మంత్రి హరీశ్‌రావు

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని గంగాపూర్ సర్పంచ్ పన్యాల లింగారెడ్డి తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆదివారం ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు ఆ కుటుంబాన్ని పరామర్శించారు. అదేవిధంగా అదే గ్రామంలో రోడ్డు ప్రమాదంలో తోటి కోడళ్లు ఇద్దరు మృతి చెందగా ఆ కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. అధైర్యపడొద్దని, ఆ కుటుంబాలకు అండగా ఉంటానని మంత్రి భరోసా ఇచ్చి వారిలో మనోధైర్యాన్ని నింపారు. మంత్రి వెంట ఎంపీపీ మాణిక్య రెడ్డి, టీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణ శర్మ, పీఏసీఎస్ ఛైర్మన్ కనకరాజు, సర్పంచ్ ఉమేశ్‌చంద్ర, నాయకులు అశోక్‌రెడ్డి, బాల్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, వేణు తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేటరూరల్: నారాయణరావుపేట మండలం మాటిండ్ల గ్రామ మాజీ సర్పంచ్ పొన్నాల సత్తయ్య తల్లి ఎల్లవ్వ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబాన్ని మంత్రి హరీశ్‌రావు పరామర్శించారు. అనంతరం జక్కాపూర్ గ్రామ ఎంపీటీసీ భాను కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలిసిన మంత్రి అతడిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. అదే గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన మల్లారెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

స్వచ్ఛతలో ప్రజలు భాగస్వాములు కావాలి

హుస్నాబాద్ మున్సిపల్ ఛైర్‌పర్సన్ రజిత



మహిళలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న రజిత

హుస్నాబాద్: చెత్త రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఆకుల రజిత అన్నారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో ఆదివారం స్వచ్ఛ ప్లేడ్జ్ కార్యక్రమం నిర్వహించారు. మహిళలతో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇంటి నుంచి వెలువడే చెత్త, చెదారం రోడ్లపై వేయకుండా మున్సిపల్ వాహనాలకు అందించాలన్నారు. పట్టణంలో ప్లాస్టిక్ కవర్లు నిషేధించామన్నారు. ప్లాస్టిక్ సంచులకు బదులు బట్ట సంచులు వాడి కాలుష్య నివారణకు కృషి చేయాలన్నారు. ముందుగా మన ఇంటి నుంచే స్వచ్ఛతను పాటించాలని, చెత్త రహిత పట్టణం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలన్నారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ అనిత, కౌన్సిలర్లు, మహిళలు, మెప్మా సభ్యులు పాల్గొన్నారు.

దేశానికే తెలంగాణ ఆదర్శం

హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

కోహెడ(హుస్నాబాద్): సంక్షేమం, అభివృద్ధిలో దేశానికే మన రాష్ట్రం ఆదర్శమని ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని సింగరాయ ఫంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. సీఎం కేసీఆర్ రాష్ట్రానికి శ్రీరామ రక్షగా నిలిచారన్నారు. క్షేత్రస్థాయిలో బీఆర్ఎస్ మరింత బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఆత్మీయ సమ్మేళనంతో కార్యకర్తల మధ్య మరింతగా అనుబంధం, చైతన్యం బలపడుతుందన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టు ద్వారా నియోజకవర్గంలోని 1లక్ష 6వేలు ఎకరాలకు సాగునీరు త్వరలో అందనుందన్నారు. నియోజకవర్గంలోని తండాలకు రూ.48కోట్లు రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు కానున్నట్లు చెప్పారు. రాష్ట్ర అభివృద్ధిని ఓర్వలేక కులం, మతం పేరుతో ప్రతిపక్షాలు చౌకబారు రాజకీయాలు చేస్తున్నాయని ఘాటుగా విమర్శించారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు హ్యాట్రిక్ విజయం ఖాయమన్నారు. కార్యక్రమంలో కర్ర శ్రీహరి, ఆవుల మహేందర్, ఎంపీపీ కొక్కుల కీర్తి, జెడ్పీటీసీ శ్యామల, ఫ్యాక్స్ ఛైర్మన్ దేవేందర్‌రావు, రాజిరెడ్డి, కుమారస్వామి, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

దుబ్బాక అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి



ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీ ప్రభాకర్‌రెడ్డి

మిరుదొడ్డి(దుబ్బాక): దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధిపై సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టి సారించినట్లు మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని అందె గ్రామంలో ఎస్సీ మాల, మాదిగ, ముదిరాజ్, రజక కమ్యూనిటీ హాల్ నిర్మాణాలకు ఆదివారం శంకుస్థాపన చేశారు. డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవతో దుబ్బాక నియోజకవర్గ సబ్బండ వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నారన్నారు. పట్టణాలకు దీటుగా పల్లెలను తీర్చిదిద్దడానికి అవిరళ కృషి చేస్తున్నారన్నారు. అందె గ్రామంలో సుమారు రూ.65లక్షలతో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ గజ్జెల సాయిలు, జెడ్పీటీసీ సూకూరి లక్ష్మీలింగం, వైస్ ఎంపీపీ పోలీస్‌రాజులు, మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ సత్యనారాయణ, దుబ్బాక ఆత్మ కమిటీ ఛైర్మన్ భాస్కరాచారి, కో–ఆప్షన్ మెంబర్ ఎండీ.అహ్మద్, సర్పంచ్ శంకర్, అల్వాల సర్పంచ్ కిష్టయ్య, ఎంపీటీసీ లలిత, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అంజిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు. అనంతరం ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో వివిధ పార్టీల నుంచి పలువురు కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలోకి చేరారు.

అ'పూర్వ' సమ్మేళనం



బెజ్జంకి(సిద్దిపేట): ఉపాధ్యాయులతో విద్యార్థులు




నంగునూరు(సిద్దిపేట): గురువులతో పూర్వ విద్యార్థులు

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1985–86లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. అప్పటి ఉపాధ్యాయులను సన్మానించారు. బాల్యంలో చేసిన పనులను గుర్తు చేసుకొని ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నంగునూరు(సిద్దిపేట): నంగునూరు ఉన్నత పాఠశాలలో 1988–89 విద్యా సంవత్సరం పదోతరగతి విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాబుద్ధులు చెప్పిన గురువులు నరసింహాస్వామి, ఎల్లంకి రామచంద్రారెడ్డి, ఆనందయ్య, రామచంద్రారెడ్డి, సోమరాజ్యం, సంజీవరెడ్డి, నారాయణరెడ్డి, నర్సింలు, హన్మంతరెడ్డి, ముకుందంలను శాలువాతో సత్కరించి మెమొంటోలు అందజేశారు.

రోడ్డుకు మరమ్మతులు చేయాలి



బురదమయమంగా మారిన కోటమైసమ్మ మార్గం

గజ్వేల్‌రూరల్: పట్టణంలోని ప్రధాన మార్గమైన ఇందిరాపార్కు చౌరస్తా నుంచి కోటమైసమ్మ వరకు ఉన్న రోడ్డు పనులు అధికారుల నిర్లక్ష్యంతో ఏళ్లు గడుస్తున్నా ముందుకు సాగకపోవడంతో ప్రయాణికులు, సమీప నివాస గృహాలవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మాల మహానాడు రాష్ట్ర యువజన కార్యదర్శి నీరుడి స్వామి మండిపడ్డారు. ఆదివారం గజ్వేల్‌లో స్థానిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల వర్షాలు కురవడంతో గుంతలమయమైన ఈ మార్గం వర్షపు నీటితో మారి బురదమయంగా తయారై ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి వెంటనే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

వీరన్నపేటలో వైద్య శిబిరం

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని వీరన్నపేటలో ఆదివారం హైదరాబాద్ ప్రతిమ ఆస్పత్రి వారి ఆధ్వర్యంలో ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 256 మందికి పరీక్షలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. అందులో ఆరుగురిని హైదరాబాద్‌కు రెఫర్ చేసినట్లు తెలిపారు. ఈ శిబిరంలో సర్పంచ్ భిక్షపతితో పాటు వార్డుసభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.